క్లుప్తంగా

ఆదివాసీలపై కేసులు ఉపసంహరించుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీలు

పాల్వంచరూరల్: ఆదివాసీ, పేదల భూములకు రక్షణ కల్పించాలని, ఆదివాసీలపై పోలీసులు పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి డి.పున్నం చంద్ మాట్లాడుతూ... పాండురంగాపురం రెవెన్యూ 126 సర్వే నంబర్ భూముల విషయంలో సాగు చేసుకున్న ఆదివాసీలకు హక్కు లేదని, తప్పుడు కేసులు పెట్టినంత మాత్రన భూములను వదిలేది లేదన్నారు. కుంజా వెంకటేశ్వర్లు, తోలెం మమత, సోమక్క, గోపమ్మ, దండి కొమరయ్య, కారం నర్సింహారావు, బండి రాంబాబు, భద్రయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం కొత్తగూడెంలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం విద్యుత్ ఏడీఈ హేమచంద్రబాబు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బర్మా క్యాంపు, బాబూ క్యాంపు, బర్లీఫిట్, సన్యాసి బస్తీ, మధుర బస్తీ, బస్టాండ్ ఏరియా, పోస్టాఫీస్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటి పర్యవేక్షించాలి

పాల్వంచ: మొక్కలు నాటి పరిరక్షించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు దొర, డాక్టర్ శైలేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు

కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల సవరణ, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మెలో సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, గ్రామ పంచాయతీ, ఆశా, అంగన్‌వాడీ, ఆటో, హమాలీ వర్కర్ల యూనియన్ నాయకులు, కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగసంస్థల కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ... ఐదు దశాబ్దాల క్రితం పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యాలు, కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య



కొత్తగూడెంటౌన్: విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



పాల్వంచ: ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు, కార్మికులు



పాల్వంచరూరల్: జీసీసీలో నిలిచిపోయిన ఎగుమతులు, దిగుమతులు



సుజాతనగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు



చుంచుపల్లి: నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు



టేకులపల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ



జూలూరుపాడు: చంద్రుగొండ క్రాస్‌రోడ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఏజెన్సీలో జీఓ 3 అమలు చేయాలి



సంఘ సభ్యత్వం అందజేస్తున్న ఈరునాయక్

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతంలో జీఓ నంబరు 3 అమలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ ఈరు నాయక్ డిమాండ్ చేశారు. మండలంలో పలు పాఠశాలలో బుధవారం సంఘ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజన నిరుద్యోగులకు స్థానికత ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పీఆర్‌సీ అమలు చేయాలని, నూతన పెన్షన్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన పదోన్నతులు కల్పించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లకావత్ రాందాస్, సపావత్ బాలకృష్ణ, గుగులోత్ రాజు, వాంకుడోత్ శ్రీనివాస్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు సిద్ధంకండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 21న జరగనున్న కొత్తగూడెం పట్టణ మహాసభ, 26, 27 తేదీలలో అశ్వారావుపేటలో జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు.

స్థానిక శేషగిరిభవన్‌లో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 15 మండలాలలో యువజన సమాఖ్య, విద్యార్థి సమాఖ్యల జిల్లా మహాసభలు పూర్తయ్యాయని తెలిపారు. కొత్తగూడెంలోని వార్డు, బస్తీ మహాసభలను పూర్తి చేసి పట్టణ మహాసభకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడి నగేష్, భూక్యా శ్రీనివాస్, ఎస్‌కే ఫహీం తదితరులు పాల్గొన్నారు.

16న స్మారక స్తూపాల ఆవిష్కరణ



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: విప్లవోద్యమ అమరవీరులు ఎల్లన్న, రాయల చంద్రశేఖర్, గండి యాదన్నల స్మారక స్తూపాల ఆవిష్కరణ, ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ చంద్ర అరుణ, జిల్లా నాయకులు నాయిని రాజు తెలిపారు. బుధవారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16న స్మారక స్తూపావిష్కరణ సందర్భంగా పట్టణంలో జేకే కాలనీ నుంచి ర్యాలీ, ఎల్లన్న విజ్ఞాన కేంద్రం ఆవరణలో సభ ఉంటుందని తెలిపారు. ఈసం శంకర్, బుర్ర వెంకన్న, శ్రీరాం కోటయ్య, ఆర్ బోసు, అజయ్, పృథ్వీ, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, గురునాథం, రఘు తదితరులు పాల్గొన్నారు.

పశువుల మందులు సరఫరా చేయాలి

సుజాతనగర్: గొర్రె, మేకలతో పాటుగా పశువులకు సంబంధించిన మందులను తక్షణమే పశువైద్యశాలలకు సరఫరా చేయాలని జీఎంపీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పశు వైద్యాధికారిణి కాత్యాయనికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్రాల తిరుపతిరావు మాట్లాడుతూ... గొర్రె, మేకలకు నట్టల నివారణ టీకాలను సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోవడంతో జీవాలు మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువుల మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బచ్చలకూర శ్రీనివాస్ నల్లగొప్పు పుల్లయ్య, చేతుల సుందర్, వీర్ల సత్యం, లింగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కనకయ్య, డీఎస్పీ చంద్రభాను, ఎఫ్‌డీఓ కరుణాకరాచారి

ఇల్లెందురూరల్: అడవులను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఉంటుందని, ప్రతీఒక్కరు చెట్లు నరకడం మానేసి మొక్కలు నాటడంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. అటవీశాఖ వనమహోత్సవంలో భాగంగా ఇల్లెందు రేంజ్ పరిధిలోని రొంపేడు బీట్‌లో అటవీశాఖ, పోలీసు అధికారులతో కలసి బుధవారం మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పోడు వ్యవసాయం కోసం అడవిని నరికి పట్టాలు పొందారని, ఇక మీదట అటువంటి వారందరూ అడవులను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బానోత్ రాంబాబు, మెట్ల కృష్ణ, డీఎస్పీ చంద్రభాను, ఎఫ్‌డీఓ కరుణాకరాచారి, ఎఫ్ఆర్‌ఓలు చలపతిరావు, నర్సింహారావు, పులి సైదులు, మండల రాము, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మండలంలో పైలెట్‌గా ఎంపికైన పూబెల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. వ్యవసాయ పనులు ఊపందుకున్నందున ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వివిధ దశలలో ఉన్న ఇళ్లకు బిల్లులు వెంటనే మంజూరయ్యేలా ఉన్నతాధికారుల దృషికి తీసుకెళ్తాని చెప్పారు. సిగ్నల్ సమస్య కారణంగా ఆన్‌లైన్ సమస్యను అధిగమించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ స్వాతి, కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గవాగు అభివృద్ధి పనుల పరిశీలన...

పట్టణంలోని బుగ్గవాగు ప్రక్షాళన పనులను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి పరిశీలించారు. బుధవారం మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో కలిసి వాగులోని రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. వర్షాలు వస్తున్న కారణంగా పనులు త్వరగా ముగించాలని, వాగులోని మట్టిని తొలగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జానీబాషా ఉన్నారు.

ఈఓపై దాడి అమానుషం

పాల్వంచరూరల్: భద్రాచలం ఈఓపై దాడి చేసిన ఏపీ రాష్ట్రంలోని ఎటపాక మండలం పురుషోత్తపట్నానికి చెందిన వారిని కఠినంగా శిక్షించాలని పెద్దమ్మగుడి పాలకవర్గం చైర్మన్ నాగేశ్వరరావు, ఈఓ రజనీకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు దాడిని ఖండిస్తూ పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం ఆలయ ఈఓ, ఉద్యోగులు, పాలకమండలి సభ్యులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. ఆలయ భూములు కబ్జాకు గురికాకుండా కాపాడే క్రమంలో ఉద్యోగులపై ఇలాంటి దాడులు బాధాకరం అన్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్లు సాయిబాబా, పాపారావు, రామిరెడ్డి, శేఖర్‌బాబు, సుధాకర్, శేఖర్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: ఆలయ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటున్న భద్రాచలం ఈఓ రమాదేవిపై భౌతికదాడులకు దిగడం అమానుషమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కొత్తగూడెం గణేష్ టెంపుల్ ఈఓ రజనీకుమారీ తెలిపారు. బుధవారం కొత్తగూడెం గణేష్‌టెంపుల్‌లో ఉద్యోగులు, అర్చకులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడారు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే వ్యక్తులను శిక్షించాలన్నారు.

మహిళా శక్తి పథకంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పిస్తూ ఈనెల 12 నుంచి చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం మండలంలోని 86 గ్రామ సంఘాల పరిధిలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం సమ్మక్క, ఏపీఎం దుర్గారావు మాట్లాడుతూ.. గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ రూ.15వేలు, వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ అద్దె బస్సు ద్వారా మహిళా సంఘాలకు లబ్ధి, సామాజిక భద్రత పథకాలు, యూనిఫాం స్టిచ్చింగ్, వ్యక్తిగత యూనిట్ల మంజూరు ద్వారా మహిళలకు కలిగిన ప్రయోజనాలపై వారం రోజులపాటు నిర్వహించే సంబురాలలో వివరించాలని సూచించారు. సుభాష్‌నగర్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చీకటి రమ కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం పొదుపు సంఘ సభ్యులు రూ.13,116లను ఆర్థిక సహాయంగా అందజేశారు.

కళాజాతా... మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి బొమ్మెర ముత్యం కళా బృందం బుధవారం మండలంలోని బాలాజీనగర్‌లో ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను కళారూపాలతో వివరించి ఆకట్టుకున్నారు. సెర్ప్ సీసీ సంపత్, కళాబృందం సభ్యులు రవి, వెంకన్న, గురవయ్య, వెంకట్, కుమారి, నీల, హుస్సేన్ పాల్గొన్నారు.

డెంగీ పాజిటివ్ నమోదు

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామంలో కారం నాగేశ్వరరావుకు డెంగీ పాజిటివ్ నిర్ధారణ జరిగింది. జ్వరంతో బాధపడుతున్న ఆయన జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకున్నాడు. పాజిటివ్ వచ్చినట్లు రొంపేడు పీహెచ్‌సీకి బుధవారం సమాచారం అందించారు.

31లోగా హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: 2026లో హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఆధ్వర్యంలో స్టేట్ హెడ్ ఎస్.మదన్‌రాజ్, జోనల్ మేనేజర్ ఎస్.నవీన్ కుమార్ సహకారంతో బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం మోకాళ్లగుంపు గ్రామంలోని యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, గొడుగులు పంపిణీ చేశారు. కొత్తగూడెం మేనేజర్లు ఎనుముల సత్యనారాయణ, రమేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సికెల్‌సెల్ పరీక్షలు చేయించాలి

కొత్తగూడెంఅర్బన్: షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది పాఠశాలకు వచ్చి సికెల్ సెల్ పరీక్షలు నిర్వహిస్తారని, ఆ రోజున ఎస్టీ విద్యార్థులంతా స్కూల్‌కు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంఈఓ ప్రభుదయాళ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ చొరవతో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సికెల్ సెల్ పరీక్షలు నిర్వహించి, ఐడీ నంబర్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఐడీతో సమగ్ర వివరాలను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు 9848434497 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

భార్య ఉండగానే మరొకరితో పెళ్లి..!

నా భర్త అంటూ స్టేషన్‌కు వచ్చిన మొదటి భార్య

సుజాతనగర్: భార్య ఉండగానే ఓ వ్యక్తి మరో యువతిని పెళ్లి చేసుకున్న ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. రాఘవాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి జూలూరుపాడు మండలం బేతాళపాడు గ్రామానికి చెందిన ఓ యువతితో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. కాగా సదరు వ్యక్తి మొదటి భార్య ఉండగానే రాఘవాపురం గ్రామానికి చెందిన మరో యువతిని పెళ్లి చేసుకొని రక్షణ నిమిత్తం పోలీసులను ఆశ్రయించాడు. ఈ జంట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న మొదటి భార్య తరఫు బంధువులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వాగ్వాదానికి దిగారు. విధుల్లో ఉన్న పోలీసులపై నలుగురు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.